

# అగరొత్తి కాలిపోయింది

"కొలకలూరి"

రవి ఉలిక్కిపడిలేచాడు గుండె ఎందుకో వేగంగా కొట్టుకొంటూవుంది. కిటికీలోంచి చూశాడు. ఇంకా సూర్యోదయం కాలేదు మసక చీకట్లో కాకుల అరుపులు ఏడ్పులులాగా వినిపించాయి

మంచం దిగలేదు వెల్లకిలా పడుకొనే పైకప్పు చూస్తున్నాడు కనిపించీ కనిపించక అయోమయంగా, హృదయంలాగావుంది. వూరి వెలుపల కొండలమీద సూర్యోదయమై, ఆ వెలుతురు కిరణాలు కిటికీలోంచ గదిలోకి వచ్చేదాకా మంచం దిగలేదు రవి

రాత్రి పడుకోబోయేముందు వెలిగించిన అగరొత్తుల గుత్తి కాలి, టేబిల్‌మీద చెల్లాచెదురుగా నుసి పడివుంది కాలకుండా మిగిలిన పుల్లలు, సంస్కారం అయ్యాకవుండే మృతదేహంలోని భాగాలు గుర్తు తెచ్చాయి వళ్ళంతా జలదరించింది. గుండె కొట్టుకోవటం ఎక్కువయింది.

టేబిల్ [illegible], బాత్ రూంలోకి వెళుతుంటే తలుపు రెక్క తలకు కొట్టుకొంది. కొద్దిగా బొప్పికట్టింది. గడ్డం చేసుకొంటుంటే తెగింది. ఎడంకన్ను విరామంలేకుండా అదురుతూ ఉంది.

అప్పటికే పని మనిషి వచ్చి, గదులూడ్చింది వేడి నీళ్ళు సిద్ధం చేసింది.

'బాబూ! కుంకుడుగాయలు కొట్టేదా?' అడిగింది.

'ఇప్పుడొద్దు. తలస్నానం సాయంకాలంచేస్తా' సని స్నానం చేస్తుంటే కాలుజారి గోడమీదపడ్డాడు. గూడు నొప్పి పుట్టింది

'ఏమిటిది?' అనుకొన్నాడు. 'అమ్మా, అమ్మడూ ఎలా ఉన్నారో?' మరీ భయం ఎక్కువయింది.

రవికి తండ్రిలేడు. తల్లి, చెల్లి వున్నారు. ఉద్యోగరీత్యా పొరుగూరు వచ్చాడు పెళ్లికాలేదు.

స్నానం ముగించి వచ్చేసరికి హొటల్‌నుంచి టిఫిన్, కాఫీ తెచ్చి వుంచింది పనిమనిషి

టిఫిన్ తిన బుద్ధి పుట్టటంలేదు తనకు తెలియని తొందర ఏదో గుండెలమీద తారాడుతూ వుంది.

కాఫీ ముగించి, సిగరెట్టు కాల్చుకొంటూ కూర్చున్నాడు రవి. మంచినీళ్ళు కూజాలో పెట్టి, వాడు నీళ్ళు బాత్‌రూం బానలోకి తోడి, కారియర్ తీసుకొని హొటల్‌కు వెళ్ళింది పనిమనిషి భోజనం తేవటానికి

రవి పుస్తకాలు ముందువేసుకొని కూర్చున్నాడు. ఆరోజు చెప్పవలసిన పాఠం సిద్ధం చెయ్యాలని తలంపు ఎంతసేపు చదివినా ఏమీ తలకెక్కటం లేదు 'ఏదో ఒకటి చెప్పవచ్చులే' అనుకొని పుస్తకాలు మూసి ఈజీ ఛైర్లో పడుకొని విశ్రాంతిగా కళ్ళు మూసుకొన్నాడు గుండె కొట్టుకోవడం తగ్గలేదు

'ఈ గుండె కేమయిం దివాళ' చిరాకుపడుతూ సిగరెట్టు ముట్టించుకొని, కిటికీలోంచి లోకంమీదికి పొగ వదులుతూ వున్నాడు కొంచెం తలనొప్పిగా వున్నట్టు అనిపించింది అసహనంగా, కోపంగావుంది. కారణం తెలియదు అమ్మ ఆరోగ్యం గుర్తుకు వస్తే బాధ కలుగుతూవుంది చెల్లి ఎలా చదువుతూవుందో? అమ్మణ్ణి ఒక ఇంటిదాన్ని చేసిందాకా తనకీ దిగులు తప్పదనిపించింది అమ్మడు కాపరానికి వెళితే అమ్మ తన దగ్గరకు వస్తుంది. అందాకా ఎక్కడోవున్న ఆమె ఎలా వుందో అనే ఆలోచనలతో, తల బద్దలు కొట్టుకోవటం తప్పదేమో!

రవి ఆ వూరి కాలేజీలో ఫిలాసఫీ లెక్చరరు. మూడేళ్లనుంచి ఉద్యోగం చేస్తున్నాడు చెల్లి పెళ్ళి అయ్యాక పెళ్ళి చేసుకొందామనుకొంటున్నాడు చెల్లికి ఆ యేటితో చదువు ముగుస్తుంది. వేసవిలో పెళ్లి చెయ్యాలి

లెక్చరరుగా చేరాక, పాఠం బాగా చెబుతాడనే విద్యార్థుల అభిప్రాయం సంపాదించుకోవాలని, ఎంతో కృషి చేశాడు 'ఫరవాలేదు ఆయన క్లాసు బాగుంటుంది' అనిపించుకొన్న తర్వాత ఆ స్థితి అయినా నిలుపుకోవాలని ప్రయత్నలోపం రాకుండా చూసుకొంటూ వచ్చాడు. తీరా క్లాసు గుర్తుకు వచ్చేసరికి, లేచి టేబిల్ దగ్గరకు నడిచాడు.

పుస్తకాలు సరిజేసుకొని కూర్చున్నాడు. ఒక పుస్తకం తీశాడు చదువుతున్నాడు ఏమీ అంతు పట్టటంలేదు. అక్షరాలు మాయమయ్యాయి, ఆ తావులో రమ కనిపించింది పుస్తకం మూసి వెనక్కి వాలాడు ఏమీ పాలుపోవటంలేదు మళ్ళీ పుస్తకం తెరిచాడు. ఈసారి రాధ కనిపించింది చిరాకుగా పుస్తకంమూసి, కోపంగా టేబిల్‌మీద కొట్టి, రూంలోంచి వెలుపలికివచ్చి, బైట కూర్చు న్నాడు.

రాధ కళ్ళలో మెదులుతూ వుంది.

రాధ అందమయిందే! తెలివి కలిగిందే! రవికి ఇష్టంలేదు. అతనివైపు ఆప్యాయంగా, ఆదరంగా కొంచెం, చిలిపిగాచూస్తుంది అందుకేనేమో రవికి కోపం రాధ థర్డ్ ఇయర్ ఫిలాసఫీస్టూడెంట్

రమ అంత సినీపకాదు తెలివితక్కువదికాదు ఆమెను చూడటం రవికి ముచ్చట. రమ అతని ముఖంలోకి ఎప్పుడూ చూడలేదు. ఎదురైతే సిగ్గుతో కుంచించుకుపోతుంది అప్పుడెంతో అందంగా వుంటుంది ఆమె ఎప్పుడూ పరధ్యానంగా వుంటుంది అలాంటి సమయంలో ఆమె ముఖాన విషాదచ్ఛాయలు కనిపిస్తాయి ఏదో పోగొట్టుకొన్నట్లు బాధగా వుంటుంది. ఎన్నోసార్లు అనుకొన్నాడు, 'ఎందుకలా వుంటావు' అని అడగాలని ఎప్పుడూ అలా ప్రశ్నించలేదు రమ సెకెండ్ ఇయర్ ఫిలాసఫీ స్టూడెంట్

రాధకంటే రమ పెద్దది దాదాపు రవి కున్నంత వయస్సు వుంటుంది అంత ఆలస్యంగా ఎందుకు చదువుతూవుందో కూడా తెలియదు తెలుసుకోవాలని అనిపించినా, ఎందుకో తెలుసుకోలేదు.

ఆలోచనలకు అంతరాయంగా పని మనిషి కేరియర్ తెచ్చింది. అన్నం వడ్డించటానికి సిద్ధమవుతూవుంది

రవి అన్నం దగ్గర కూర్చున్నాడు సహించటం లేదు రెండు ముద్దలు కూడా సరిగ్గా తినలేకపోయాడు. విస్తరి దగ్గర్నుంచి లేచాడు పని మనిషి వింతగా చూస్తూ వుండిపోయింది.

బట్టలు వేసుకొనేలోపల మిగిలినవి తీసుకొని ఆమె వెళ్ళిపోయింది. తలకు నూనె రాసుకొంటుంటే బట్టలమీద రెండు చుక్కలుపడ్డాయి. నొసటిమీదకు నూనె జారింది. తుడుచుకొంటుంటే చేయి వణికింది

తలుపుకు తాళం వేసేటప్పుడు రెక్కలమధ్య వేలు పడి నలిగింది. రెండుసార్లు వేస్తే తప్ప తాళం పడలేదు మేడ మెట్లు దిగుతుంటే కాళ్ళు వణికాయి ప్రహరీ దాటగానే ఎదురు దెబ్బ తగిలి పడబోయి నిలద్రొక్కుకొన్నాడు

'ఏమయింది నాకు' తనలో తనే గొణుక్కొని కార్నర్‌లో రిక్షాకోసం ఆగాడు. ఎటునుంచీ రిక్షా రాకపోకలు కనిపించలేదు.

టైం పదయింది ఫస్ట్ అవర్ క్లాసుంది. అప్పటికే చాలా ఆలస్యమయింది. కంగారుగా వున్నాడు నడక సాగింది మధ్యలో రిక్షా ఎదురయింది ఎక్కాడు రిక్షా కదిలింది.

కాలేజిముందు రిక్షా ఆగింది దిగాడు. పిల్లలెవరూ క్లాసులకు పోయినట్లులేదు. అందరూ వరండాల్లో ప్రిన్సిపాల్ గదిముందు, అక్కడక్కడా చెదురు మదురుగా వున్నారు.

ఎందుకైనా సమ్మె చేస్తున్నారేమో! ముందుకు సాగడు.

విద్యార్థుల జట్లు జట్లుగా వెళ్లిపోతున్నారు అరుపులూ, ఆవేశమూలేవు సమ్మె కాదేమో

ఇంతలో ఆడపిల్లల జట్టు ఎదురయింది దానివెంబడి రాధ గబ గబా దగ్గరకు వచ్చింది. చెప్పింది.

'రమ చనిపోయింది సార్ కాలేజికి సెలవు'.

"ఏమిటీ?"

'రమ చనిపోయింది!'

'రమ చనిపోయిందా?'

'అవునుసార్ కిరోసిన్ ఆయిల్ వంటిమీద పోసుకొని కాల్చుకొని చనిపోయింది రాత్రి'

రవికి అప్పటికిగాని రమ చనిపోయిందనేవార్త మనస్సుకెక్కలేదు రెండు క్షణాలు చలనంలేకుండా మౌనంగా నిలబడిపోయాడు.

'రమను చూడడానికి వెళుతున్నాం సార్ ! మీరూ వస్తారా? మీ స్టూడెంట్‌గా !'

'సరే! రవి వాళ్ళతోపాటు నడక సాగించాడు.

రాధ అనిన 'మీ స్టూడెంటేగా' చెవుల్లో గింగురుమంటూవుంది ఆమె అలా ఎందుకంది? ఆలోచన కలిగింది.

రమ ఎలా తన విద్యార్థినో, రాధ కూడా అంతే! కాని అంతకంటే 'మీ స్టూడెంట్' అనటానికిక మరొక అవకాశంవుంది.

రమ ఫస్ట్ ఇయర్‌లో చేరినప్పుడు హిస్టరీ స్టూడెంట్ కాలేజీలో చేరిన రెండో వారం తన దగ్గరకు వచ్చింది హిస్టరీనుంచి ఫిలాసఫీకి మార్పించుకుంటానని మీ అభిప్రాయం చెప్పండి అని అడిగింది. అందుకు తనేమీ అభ్యంతరం చెప్పలేదు ఏ సబ్జెక్టు చదివితే ఎంత మేలుంటుందో వివరించాడు ఆమె ఫిలాసఫీ తీసుకొంటాననంది ఆమె ఆ నిర్ణయానికి వచ్చిందతర్వాత ఆఫీసులో జరగవలసిన పనంతా తనే చూశాడు అందువల్ల రమనుగూర్చి రాధ 'మీ స్టూడెంటేగా' అని వుంటుంది అంతకంటే ఇంకా అనేందుకు అవకాశం ఏముంది? రమతో అప్పుడు తప్ప తనింకెప్పుడూ ఏమీ మాట్లాడలేద. ఏమో కొంతమంది ఆడపిల్లలు కాపురాలుచేసే ఆడవాళ్ళకంటే ఆరిందాల్లా మాట్లాడుతారు, మసలుతుంటారు.

రవి మనస్సు నిండా విచారం నిండివుంది. అయితే గుండెదడ, కాళ్ళవణుకు, తగ్గి మనస్సు సంచరించటం ప్రారంభమయింది

'పాపం రమ ఏడిపిస్తుండే వాళ్ళంసార్' రాధ చెబుతూవుంది

'ఊ !'

'మీకు కనబడితే మీ మాస్టారు వస్తున్నారు చూడు తల్లీ, వెళుతున్నారు చూడుభాగ్యశాలీ అనో అంటూ వుండేవాళ్ళంసార్'

'ఎందుకూ?'

'సరదాకి!'

రవికి రాధమీద చిరాకు కలిగింది రమను అలా అంటూండే అందుకూ, ఆ విషయం నిర్భయంగా తనతో అన్నందుకూ. మీ మాస్టారు అన్నట్లుగానే తనతోనూ మీ స్టూడెంటు అంది అంటే ఆమెను సరదాగా ఏడిపించినట్లే తన నూనా? రాధమాటలతో నచ్చలేదు

'అప్పుడు రమ ఏమనేది అని అడుగుదామనుకొన్నాడు. కాని ఏమీ మాట్లాడలేదు.

'ఆ మాటలూ, ఈ మాటలూ అని కంటతడి పెట్టుకొనేట్టు చేసేదిసార్ రాధ. పాపం రమ కళ్ళ నీళ్ళు కళ్ళలో క్రుక్కుకొని నోరెత్తకుండా వూరుకొనేది ఇంకోమ్మాయి చెప్పింది.

'పాపం రమ!' అనుకున్నాడు రవి. ఆమెమీద జాలి కలిగింది.

తోవవెంట నడుస్తుంటే పిచ్చి పిచ్చి ఆలోచనలు వెంటబడి వస్తున్నాయి.

'ఈవిధంగా ఎందుకు చనిపోయింది? అనే ప్రశ్న మాత్రం రవిని వెంటాడుతూ వుంది. అప్పుడప్పుడూ 'రాధ మాటలు కారణం కాదుగదా' అనిపిస్తూ వుంది.

విద్యార్థులంతా విచారంగాలేరు. కొందరి ముఖాలలో బాధ కనబడుతూవుంది. కొందరు నిర్వికారంగా వున్నారు అయితే ఎవరి ముఖంలోనూ సంతోషంలేదు. రాధ ముఖంలో లీలామాత్రంగా భయంకరమైన సంతోషం, రవికి కనిపించినట్లయింది

'రమ వాళ్లు చాలా బీదవాళ్ళండి' విద్యార్థిని ఎవరో చెప్పింది

'బీదవాళ్లు అంతా చనిపోతున్నారా? ఎంతమంది ఏదో విధంగా జీవించటంలేదూ? రమ మరణానికి కారణం ఇదికాదు' అనుకొన్నాడు.

'రాధా! రమ ఎందుకు చనిపోయిందంటావ్?' ప్రశ్నించాడు.

'ఏమో! ఏమోనండి! నాకెలా తెలుస్తుంది సార్ ?'

రవి మాట్లాడలేదు నడుస్తూ వున్నాడు.

'నాకేం తెలియదుసార్! పాపం ఎందుకిలా చనిపోయిందో!' రాధ చెప్పింది.

వెనుకా ముందు వున్న విద్యార్థులు రవి వాళ్ళతో కలిశారు

రమకు జీవితంమీద విరక్తి పుట్టివుంటుంది. ఆశాలతలు ఎండిపోయి వుంటాయి భవిష్యత్తు అంధకారంలా కనిపించి, ఏం చేయటానికి చేతకాక, చేతనయిన చావు తెచ్చుకొంది చనిపోయింది.

అయితే ఆమె అలా తయారు కావటానికి కారణంమాత్రం అంతు చిక్కలేదు.

రవి ఆలోచిస్తూ నడుస్తున్నాడు.

'రమ తల్లి రమను తిడుతూ కొడుతూవుంటుంది' విద్యార్థి చెప్పాడు

'ఎందుకూ?' రవి ప్రశ్న వేయకముందే మరో విద్యార్థి చెప్పాడు. 'ఆమె సొంత తల్లికాదు. మారుతల్లి'

సవతితల్లు లెంతమంది. మొదటి సంబంధం సంతానాన్ని తన సంతానంలాగా చూచుకోవటం లేదూ? పోనీ ఎంతమంది హింస పెట్టటంలేదూ? అందరూ చనిపోతున్నారా?

'రమ తండ్రి ఏమీ అనడా భార్యని?' రవి ప్రశ్నించాడు.

'ఏమంటాడు సార్! ఆయనొక తాగుబోతు ఇంటి దగ్గరున్నాడు అంటే తాగాడు అనే! లారీ

డ్రైవరు. ఎప్పుడో వారానికి రెండు మూడు రోజులుంటాడు ఇంటివద్ద. ఉన్నప్పుడు రమను పూరికినే తిడతాడు. అప్పుడప్పుడుగా చేయి చేసుకోవటంకూడా చూశాను అనవసరం చదువుతూ వుందని, ఉద్యోగంచేసి నాలుగురాళ్ళు తెచ్చి కుటుంబానికి అండగా నిలబడకుండాపోయిందనీ తాగిన మత్తులో ఇష్టం వచ్చినట్లు బూతులు మాట్లాడుతుంటాడు మేమే వినలేక పోతుంటాము పాపం ఎలా సహించేదో!' విద్యార్థి చెప్పాడు. అతను రమ ఇంటి కెదురు మేడలో అద్దె కుంటున్నాడు ఆమె మరణవార్త కాలేజీకి తెచ్చింది అతనే!

రమ ఇంటర్ మీడియట్ చదివింది తప్పింది. మళ్ళీ పరీక్ష వ్రాయలేదు వ్రాయాలనే అనుకోలేదు. సర్వీసు కమీషన్ ఉద్యోగం వచ్చింది. తాలూకా ఆఫీసులో యల్. డి సి. గా చేరింది నాలుగేళ్ళు ఉద్యోగం చేసింది. ఇంతలో త్రీ ఇయర్ డిగ్రీ కోర్సు వచ్చింది ఆమెకు ఇంటర్‌లో వచ్చినమార్కులతో ఫస్ట్ ఇయర్‌లో చేరింది ఉద్యోగానికి సెలవు పెట్టి. ఆమెకు పెళ్లి కాలేదు. పెళ్ళి చేయాలనే తలంపే తండ్రికి కలగలేదు. ఉద్యోగం చేస్తూ సంపాదించుకొన్న కొద్ది డబ్బుతో, చదువు పూర్తి చేయాలని భావించుకొంది. రమ ఏం చేసినా అంతగా పట్టించుకోని తండ్రి కాలేజీలో చేరుతుంటే కూడా ఏమీ అనలేదు. తీరా నెల తిరిగేసరికి ఇంటికి వచ్చే ఆమె జీతం ఆ నెలలో రాకపోయేసరికి తండ్రికి బాధ కలిగింది తండ్రిది స్వతహాగా ఆమెను ఏమీ అనే స్వభావం కాకపోయినా భార్య చెవిలో గూడుకట్టుకొని వందలు చెబితే ఒకటో రెండో బుర్రకెక్కుతూ వుండేవి. తాగిన మత్తుతో తిరిగి పోతున్న తలలోకి ఆమె పోరు చొరబడితే ఆ సమయంలో ఏం అంటున్నాడో, ఏం చేస్తున్నాడో తెలియకుండా అయిపోయేవాడు. అన్నీ సహిస్తూ వుండేది రమ.

వెనుకనుంచి స్టాఫ్ మెంబర్సు అయిదుగు రారుగురు వస్తుంటే రవి కొంచెం ఆగాడు వాళ్ళు వచ్చి కలిశారు. పిల్లలు ముందుకు వెళ్ళిపోయారు

'రమ కాలేజీలో చేరిన మొదట్లోనే ఈ అమ్మాయి ఆత్మహత్య చేసుకొనే బాపతే అనుకొన్నాను' అన్నాడు సైకాలజీ లెక్చరరు.

'యస్ యస్ యల్ సి పాసయిన పిల్లలు

# అగరొత్తి కాలిపోయింది

పి. యు. సి. లో చేరినట్లే ఒక రకమయిన మానసిక క్షోభలో మునిగిపోయినవాళ్ళు—పిరికివాళ్ళు—ఆత్మహత్య తరగతిలో చేరుతారు. వెనకా ముందుగా పి. యు. సి. పాసయినట్లే—ఆత్మహత్య చేసుకొంటారు' ఆయన చెప్పుకుపోతున్నాడు.

'రమకున్న మానసిక క్షోభ ఏమిటంటారు' ఎవరో ప్రశ్నించారు

'ఎలా చెప్పగలం?' సమాధానంతో తిరిగి ప్రశ్నించాడు మళ్లీ చెప్పాడు. 'వయస్సు ముదిరిన పిల్లకదా ప్రేమ వైఫల్యమేమో!'

'నేనలా అనుకోను. ఆమె గుణవతి కాలేజీ ఆడపిల్లలు అందరిలో అంత నెమ్మదిగా వుండేవాళ్లే లేరు రమతప్ప ఎవరో అన్నారు

'నువ్వు గమనించిందేమిటో' అదే నేనూ గమనించింది. అలాంటివాళ్ళను నువ్వు గుణవతిఅంటావు. అంటున్నావు నేను ఆత్మహత్య తరగతిలో చేర్చుతాను' చాలా గంభీరంగా చెప్పాడు సైకాలజీ లెక్చరరు.

'ఏమయ్యా నువేం మాట్లాడవేం?' అన్నారెవరో రవిని ఉద్దేశించి

'అతనేం మాట్లాడుతాడు. సెన్సిటివ్ టైప్' అన్నాడు సైకాలజీ లెక్చరరు . .

రవి ఏమీ అనలేదు తలవంచుకొని నడుస్తున్నాడు తోవన ఎవరూ రమను గురించి ఇంకేమీ మాట్లాడుకోలేదు వినే విషయం లేకపోవటంతో రవిని ఆలోచనలు చుట్టుముట్టాయి

రమ ఎవరినైనా ప్రేమించిందేమో! పెళ్ళి వీలుకాకుండా పోయిందేమో! 'అతను' తిరస్కరించాడు కాబోలు కుల మతాలు అడ్డు వచ్చి వుండవచ్చు అంతస్తులు దాటరానివివి అయిపోయి ఉండాలి

ఇలాంటి ఆలోచన రవికి అసలు ఇష్టంలేదు. అయినా వున్న మనస్సు వూరికినే వూరుకోవటం లేదు. రమ ఎవరినైనా ప్రేమించి వుంటుందనుకొంటే అర్థంలేని బాధ కలుగుతూవుంది ఆమెను చూచిన ఎవరికీ రమ ప్రేమిస్తుందనికానీ, ప్రేమింపబడుతుందనికానీ అనిపించదు

అంతకుముందురోజు జరిగిన సంఘటన వచ్చి మనస్సులో కూర్చుంది. చెద పురుగులాగా మెదడు తొలిచి వేస్తూ వుంది ఆమె ఎందుకలా చేసిందో అర్థం కాలేదు అర్థం కావటంలేదు

మధ్యాహ్నం ఫస్ట్ అవర్ క్లాసులో అటెండెన్సు తీసుకొంటూ కూర్చున్నాడు రవి. రమ తలుపులో నిలబడింది. రవి చూశాడు చాలా అందంగా కనిపించింది. 'కమిన్' అన్నాడు ఆమె ఒకడుగువేసి, రెండుక్షణాలు మౌనంగా నిలబడి, గిరుక్కున వెనుదిరిగి, పర్మిషన్ అడగకుండా వెళ్ళిపోయింది ఆమె ఎందుకలా వెళ్ళిందో తెలియలేదు తెల్లవారేసరికి చనిపోయింది.

అవర్ పూర్తి కాగానే రమను పిలిచి, ఆ ప్రవర్తనకు చీవాట్లు పెడ్దామనుకున్నాడు. తీరా గంట గడచి, రవి క్లాసులోంచి వెలుపలికివచ్చి, రమను పిలవమని ప్యూన్ని పంపితే అప్పటికే ఇంటికివెళ్ళి పోయినదని తెలిసింది

పోనీ, ఇంటికివెళ్ళి, ఎందుకలా వెళ్ళిపోయావని అడుగుదామనుకొన్నాడు. అయితే వెళ్ళలేదు బాగుండదనుకొన్నాడో, మరచిపోయాడో, రేపు ఫస్ట్అవర్‌లో అడుగుదామనుకొన్నాడో!

'నిన్న సాయంకాలం నేను వెళ్ళివుంటే ఆమె బ్రతికేదా' అనుకొన్నాడు రవి! పోనీ తన మానసిక సంక్షోభం అయినా చెప్పేదా?' ఆలోచించసాగాడు. విపరీతంగా బాధ కలుగుతూ వుంది క్షణం క్షణం అది అధికమయి పోతూ వుంది

లెక్చరర్లు రమ ఇంటికి కొచ్చారు ఇంటిచుట్టూ జనం మూగివున్నారు కాలేజీ స్టూడెంట్సు ఎక్కువమంది ఉన్నారు ఆడపిల్లలు రమ శవం చుట్టూ గుమిగూడివున్నారు ఇల్లు చాలా చిన్నది పేదరికానికి ప్రాతినిధ్యం వహించే ఇల్లులాగ వుంది

రమ తండ్రి ఇంటి దగ్గర లేదు ఏ వూరో లారీతో వెళ్ళాడు తల్లీ, ఆమె కొడుకులూ కూతుళ్లూ ఏడుస్తూవున్నారు ప్రక్క యిళ్ల ఆడవాళ్ళు ఆమెకు వోదార్పు కలిగే మాటలు చెబుతున్నారు. ఎవరెవరో ఏవేవో దిగులుగా, సానుభూతిగా, జాలిగా మాట్లాడుకొంటున్నారు

లెక్చరరు దగ్గరకు పోయేసరికి, విద్యార్థినులు తప్పుకొన్నారు రవి చూశాడు రమ ముఖం వికృతంగా కనిపించింది కాలి, బొబ్బలువచ్చి, పగిలి, చెమ్మ చెమ్మగా, ముఖం భయంకరంగ వుంది. తల కాలిపోయింది వెంట్రుకలు కమిరిపోయాయి. ముఖందాకా గుడ్డ కప్పారు రవి తొలగించబోయాడు. సైకాలజీ లెక్చరరు వద్దని వారించాడు. రవి ఇంకేమీ కదలలేదు కళ్ళలో తిరుగుతున్న నీళ్ళు ప్రక్కకు తిరిగి కర్చీఫుతో అద్దుకొన్నాడు.

రాధ దగ్గరకువచ్చి, 'ఇటురండిసార్' అంది. వెళ్ళాడు ప్రక్కకు

'ఆ చీరెతోనే వళ్ళు కాల్చుకొందిసార్!'

'ఏ చీర?'


'నిన్న మధ్యాహ్నం కాలేజీకి కట్టుకువచ్చిన చీర!'

'ఏం? ఆ చీరె అయితేనేం? ఏ చీరె అయితేనేం?'

'ఆ చీరె చాలా బాగుంది!'

'నువ్వేమయినా అన్నావ?'

'అవునుసార్! 'రమాదేవిగారూ! ఎవరికోసం ఈ చీరె సింగారం' అన్నానండి మాటాడకుండా ఫస్టు అవర్ మధ్యాహ్నం మీ క్లాసుకి వచ్చింది'



రవి గుండెల్లో. మరమేకు దిగినట్లయింది. అర్ద్రాలయిన కళ్ళలోంచి రెండు నీటిబొట్లు జారాయి

'ఇక్కడెందుకు నువ్వు. ఇంటికి వెళ్ళు. ఎక్కడా ఏమీ వాగకు. వెళ్ళు ఇంటికి'

రాధ పిల్లి పిల్లలాగా వెళ్ళిపోయింది.

ఎప్పుడో లెక్చరర్లు పిలవకుండా వెళ్ళిపోయారు రవి దగ్గర కొక విద్యార్థివచ్చి, 'రాత్రి రెండు గంటల దాకా చదువుతూ వుండటసార్. ఇదిగో ఇక్కడే కూర్చుని . ' అక్కడకు వెళ్ళారు.

ఫిలాసఫీ టెక్స్ట్ అక్కడేవుంది. నోట్సు కాలి పోయింది. 'రమ కాల్చుకోలేదుసార్. ఎవరో ఆమెను కాల్చారు' అంటూ బాధగా చెప్పాడు.

'అలా మాట్లాడకు. వూరుకో!'

టెక్స్టు, కాలిన నోట్సు రవి తీసుకొన్నాడు నోట్స్ పూర్తిగా కాలిపోలేదు. దాన్ని తిరగవేశాడు నోట్సంతా తను చెప్పిందే! ఒకచోట తెలుగులో నాలుగు వాక్యాలు కనిపించాయి.

"ఆయన ఒక్కర్నే నమ్ముకొన్నాను. నేను ప్రేమించలేదు. ఈ తల్లీ తండ్రీ సాక్ష్యంగా నేను ప్రేమించలేదు — ప్రేమిస్తే మాత్రం ఏం— ఏం తప్పుంది ఆయనకు నేనెరివనో తెలియదు. అదే పదివేలు నాకంటే చిన్నవాడుకాదు. పెద్దవాడు నిజంగా పెద్దవాడు. నాకు ఆయన భర్తకాడు నన్ను పెళ్ళాడలేదు నాకా కోర్కలేదు

"ఆయన నాకు అన్నయ్య అన్నయ్య. అన్నయ్య."

నెమ్మదిగా నోట్స్ మూసి అక్కడే పెట్టాడు రమ ఆ మాటలు రాత్రివ్రాసిందో అంతకుముం దెప్పుడైనా వ్రాసిందో తెలియదు ఎవరినిగూర్చి వ్రాసిందో కూడా తెలియదు.

రమ శవం దగ్గరకు వస్తున్నవాళ్ళు వస్తున్నారు. పోతున్నవాళ్ళు వెళ్ళిపోతున్నారు. రవి గుండెలు బరువుగా అయిపోయాయి. బాధగావుంది. వెళ్ళిపోవటానికి సిద్ధమయి, మళీ రమ ముఖం చూశాడు.

మనువు కనిపించినంత భయంకరంగా వికృతంగా కనిపించలేదు. మామూలుగావుంది. కళ్ళు అద్దుకొంటూ వెలుపలికి వచ్చాడు. రిక్షాలో రూంకి వచ్చాడు. తోవ పొడుగునా రమ ముఖమే కళ్ళలో మెదులుతూవుంది రమ రూపమే హృదయంలో కదులుతూవుంది. రమ ఆలోచనలే మనస్సుని తొలుస్తున్నాయి.

రూందగ్గర పనిమనిషి ఉంది. తాళాలు యిచ్చి తలస్నానానికి నీళ్ళు పెట్టమని చెప్పాడు ఆమె స్టౌ వెలిగిస్తుంటే గుండెలో అగ్నిజ్వాలలు రగులుతున్నట్లు అనిపించింది. కుంకుడుగాయలుకొడుతూ వుంటే గుండెమీద రాతితో కొట్టినట్లు వుంది తల స్నానం అయింది.

ఆరోజంతా రవి ఎక్కడికీ పోలేదు. సాయంకాలం కాఫీ తాగలేదు. రాత్రి అన్నం తినలేదు పచ్చి మంచినీళ్ళు ముట్టుకోకుండా లంఖణం చేసినట్లు మంచంమీద పడి ఉన్నాడు. గదిలో లైట్లు వేసుకోకుండా చీకటిలో ఒంటరిగా నిద్రపోయాడు

తెల్లవారింతర్వాత నిద్రలేచి టేబిల్ వైపు చూస్తే, అగరొత్తుల గుత్తి లేకపోయినా, కాలిన అగరొత్తి కనిపించింది. కళ్ళు నులుంకొని చూచేరికి అగరొత్తి మాయమయింది. ●





# పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ పరియైనచర్యను గురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన మీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేదీ, వేళవివరములున్నూ, మీ సరియైన చిరునామానూ, వెంటనే వ్రాసివంపండి. జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసినతేదీ లగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయము కలుగునో, ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాత్ ద్రవ్యలాభము మొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు 1.25 పై. లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి పి. ఛార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహములేవైనా ఉన్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా లేనిఎడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి

**PT. DEV DUTT SHASTRI, RAJ JYOTISHI (A. W. P)**
**Post Box No 86, JULLUNDUR CITY**



# అలసటా? నాకు లేదు!



నిజం. రోజంతా నేను శ్రమించినమాట నిజం.
ఇంటికి తిరిగివచ్చేటప్పుడు క్రిక్కిరిసివున్న బస్సులో నిలబడినాసుకూడా
ఇంటికి చేరేసరికి అలిసిపోయాను. కానీ. ఇప్పుడు అలసటలేదు.
ఉత్సాహమిచ్చే ఓవోమాల్ట్ ఒక కప్పు త్రాగగానే అలసటంతా తీరిపోయి
ఉత్తేజం కలిగింది. కొత్తగా పరిపుష్టికరం చేయబడిన శక్తిప్రదాయిని ఓవోమాల్ట్
కుటుంబంలో అందరికీ సమపాళ్ళ కలిగిన పోషకాహార పానీయం.

# ఓవోమాల్ట్



ఉత్పత్తిదారులు:
**ఫుడ్స్ ఫ్యాట్స్ & ఫెర్టిలైజర్స్ లిమిటెడ్**
తాడేపల్లిగూడెం, ఆంధ్ర ప్రదేశ్
సేల్స్ అడ్మినిస్ట్రేషన్:
115-బి, నేతాజీ సుభాస్ చంద్రబోస్ రోడ్, మద్రాసు-1

EP-FFP 13 TEL